క్లుప్తంగా

ఏజెన్సీ చట్టాలను అమలు చేయాలి

మణుగూరురూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏజెన్సీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కల్లూరి జయబాబు డిమాండ్ చేశారు. స్థానిక హనుమాన్ గార్డెన్స్‌లో శనివారం ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా మహాసభ నిర్వహించారు. ఈ మహాసభకు ఏటీఏ రాష్ట్ర అధ్యక్షుడు జయబాబు, ఏఎస్‌సీ రాష్ట్ర అధ్యక్షుడు పూనెం శ్రీనివాస్, ఏటీఏ వ్యవస్థాపకులు కొర్సా వెంకటేశ్వరరావులు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. జీవో నంబర్ 3ను గెజిట్ చేసి చట్టబద్ధత చేయాలన్నారు. పెసా, 1/70 , అటవీహక్కు చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. గిరిజనుల పోడుభూములకు పట్టాలు ఇవ్వాలని, ఏజెన్సీలో గిరిజన ఆదివాసీలకు వంద శాతం ఉద్యోగాలు, పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ ప్రజలందరూ ఏజెన్సీ చట్టాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. హక్కుల సాధన కోసం ఆదివాసీలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో నాయకులు ట్రికార్ జీఎం కుంజా శంకర్, చీమల సత్యం, సారయ్య, నాగేశ్వరరావు, హనుమంతరావు, నాగయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి పూజలు

దమ్మపేట: మందలపల్లిలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ, బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమాల్లో పాల్గొన్న తుమ్మలకు.. ఆలయ మార్యాదలతో స్వాగతం పలికారు. వేదపండితులు ఆయనకు ఆశీర్వచనం అందజేశారు.

యాత్రను జయప్రదం చేయండి

చర్ల: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఖండిస్తూ సీపీఎం చేపట్టిన జన చైతన్య యాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలగాని బ్రహ్మచారి పిలుపునిచ్చారు. శనివారం చర్ల మండల కేంద్రంలో బీఎస్ రామయ్య భవనంలో మచ్చా రామారావు అధ్యక్షతన మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఖండిస్తూ సీపీఎం జన చైతన్య యాత్ర 17వ తేదీన వరంగల్లో మొదలవుతుందని 19వ తారీకు చర్ల మండలానికి చేరుతుందని, 19 తారీకు సాయంత్రం 3 గంటలకు బస్టాండ్ సెంటర్‌లో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగం పైన ప్రజాస్వామ్యం పైన దాడి చేస్తోందని విమర్శించారు. పెట్రోల్ డీజిల్ ధరలను ఆకాశాన్ని అంటే విధంగా పెంచిందని, రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించట్లేదని అన్నారు. ఉపాధి హామీ పనులను 200 రోజులకు పొడిగించాలని, పెరుగుతున్న నిత్యవసర ధరలకు కనీస వేతనాల చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల కార్యదర్శి కారం నరేష్, మండల కమిటీ సభ్యులు బందెల చంటి, తాటి నాగమణి, శ్యామల వెంకట్, పామరు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

గొత్తికోయలకు దుస్తులు పంపిణీ



ఆదివాసీ గొత్తికోయలకు పంపిణీ చేసిన సామగ్రితో ఫౌండేషన్ బాధ్యులు

చంద్రుగొండ: మండలంలోని మద్దుకూరు గ్రామశివారు అటవీప్రాంతంలో నివాసముంటున్న ఆదివాసీ గొత్తికోయలకు 'హ్యాపీ టూ హెల్ప్ యూ'ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం దుస్తులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మిషన్ ఫర్ ట్రైబ్స్ కార్యక్రమంలో భాగంగా ఆదివాసీలకు పెలు సామగ్రి అందించారు. దుస్తులతోపాటు సూట్‌కేసులు, పిల్లలకు తినుబండారాలను అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు శ్రీనివాస్, వినయ్, లేంటిన్, మనీష్, రవితేజ, రామకృష్ణ, సుజిత్ పాల్గొన్నారు.

మహాసభల వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

చంద్రుగొండ: ఈ నెల 12న పాల్వంచలో నిర్వహించతలపెటిన ఇఫ్టు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర నాయకుడు ఎస్‌కె.ఉమర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రం చంద్రుగొండలో శనివారం మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉమర్ మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకుడు ఏదులాపురం గోపాలరావు, ఆటోయూనియన్ నాయకులు ఇనుముల పిచ్చయ్య, ఆర్.రవి, యండి.అన్వర్, ఎస్.రాంబాబు, ఎస్.భాస్కర్, నర్సింహారావు, రామారావు పాల్గొన్నారు.

మట్టి కుండలకు క్రేజ్

- ఆరోగ్య ప్రయోజనాలు అధికం
- ఫలితంగా తగ్గని డిమాండ్
- వేసవిలో కొనుగోలుకు ప్రజల ఆసక్తి



నల్లాలతో కూడిన మట్టి కుండలు..



విక్రయానికి సిద్ధంగా ఉన్న వివిధ రకాల మట్టి కుండలు

సండే స్పెషల్

భద్రాచలంటౌన్: మట్టితో కుండను తయారు చేసి వాడకం మొదలైన నాటి నుంచి నేటి ఆధునిక కాలం వరకు వాటి క్రేజ్ తగ్గడం లేదు. వేసవి కాలం వచ్చిందంటే ధనిక, పేద అనే తారతమ్యం లేకుండా అందరూ మట్టి కుండలోని నీటిని తాగేందుకే ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. ఫ్రిజ్ నీరు కంటే మట్టి కుండలోని నీళ్లు ఆరోగ్యానికి ఎంతో మంచిది. దీంతో మట్టితో తయారు చేసిన రంజన్లు, కుండలకు ఉన్న ప్రాధాన్యత మాత్రం తగ్గడం లేదు. ఈ వేసవిలో కూడా పట్టణంలోని కుండల వ్యాపారులు అనేక రకాల కుండలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఇక మారుతున్న కాలానికి అనుగుణంగా వాటిని మలుస్తున్నారు.

ఒకప్పుడు మట్టి కుండలో వంటకాలు చేసేవారు. రుచితో పాటు ఆరోగ్యానికి ఎంతో మేలుగా వుండేది. రోజు రోజుకు వస్తున్న మార్పులు పాశ్చాత్య దేశాల ప్రభావంతో ఏ ఇంటలో చూసినా అల్యూమినియం పాత్రలు, ప్రెషర్ కుక్కర్లలో వంటలు చేస్తున్నారు. కానీ ఆనాటి కాలం వారు మట్టి కుండలో తయారైన భోజనం తిని ఎంతో ఆరోగ్యంగా, ఏ వ్యాధులు లేకుండా జీవించేవారు. కాలక్రమేనా మట్టి కుండల్లో వంటకాలు కనుమరుగై, వేసవిలో మాత్రమే కుండలో నీటిని తాగడానికే ప్రజలు ఇష్టపడుతున్నారు. సాంకేతికంగా రిఫ్రిజిరేటర్లు ఎంత అందుబాటులో ఉన్నా కుండలకు సాటిరావని కొనుగోలుదారులు అభిప్రాయపడుతున్నారు. మట్టి కుండలను వివాహాది శుభ కార్యములకు ప్రజలు వాడుతుండడంతో విక్రయాలు ఎక్కువగానే జరగుతుంటాయి. జిల్లాలోని ఆయా పట్టణాలు, మండల కేంద్రాల్లో ప్రధాన రహదారుల వెంట మట్టి కుండలు విక్రయానికి సిద్ధంగా వున్నాయి.

ప్రయోజనాలెన్నో..

మట్టి కుండలో నీరు చల్లబడేందుకు బాష్పీభవనం సూత్రంపై పనిచేస్తుంది. దీని వల్ల ఆ నీరు ఎల్లప్పుడూ చల్లగానే ఉంటుంది. బంకమట్టిలో పోరస్ నీటిని క్రమంగా చల్లబరుస్తుంది. కుండలో నీరు తాగడం వల్ల జలుబు, దగ్గు వంటి సమస్యలు రావు. వేసవి కాలంలో ఎండలో తిరిగి వడదెబ్బ బారిన పడుతుంటారు. వడదెబ్బ బారిన పడినప్పుడు విటమిన్లు, ఖనిజాలు అధికంగా ఉండే కుండలోని నీరు తాగడం ద్వారా శరీరంలో గ్లూకోజ్ స్థాయి పెరుగుతుంది. మట్టి ఆల్కలిన్ కుండలో నీరు తాగడం వల్ల శరీరానికి ఆమ్ల శాతం అంది ఎసిడిటీని తగ్గిస్తుంది. సహజ పద్ధతిలో చల్లబడిన మట్టి కుండలో నీరు తాగడంతో జీర్ణక్రియ మెరుగు కావడానికి దోహదపడుతుంది. ప్లాస్టిక్ డబ్బాలలో నీటిని నిలువ చేయడం కన్నా మట్టి కుండలో నీరు నిలువ చేయడం ఎంతో మేలు. కుండలో నీరు తాగడం వల్ల మన శరీరంలో టెస్టోస్టిరాన్ హార్మోన్ పెరగడానికి అవకాశం ఉంటుంది.

ఏజెన్సీలో వాడకం ఎక్కువ..

భద్రాచలం ఏజెన్సీలోని గిరిజనులు వేసవిలో అధికంగా మట్టి కుండలోని నీటి తాగుతుంటారు. ప్రతి ఇంటిలో ఒక కుండలో నీరు తప్పక కనిపిస్తుంది. వేసవిలో మట్టి కుండలకు గిరాకీ ఎక్కువగానే ఉంటుంది. దీంతో వ్యాపారులు సరిహద్దు రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, ఒరిశాల నుంచి మట్టి కుండలను దిగుమతి చేసుకుంటారు. సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా రూ.100 నుంచి రూ.250 వరకు మట్టి కుండలను వ్యాపారులు విక్రయిస్తున్నారు. ప్రజలు సులువుగా వాడుకునేందుకు వీలుగా కుండలకు ట్యాప్‌లను అమర్చి ఇస్తున్నారు.

వేసవిలో గిరాకీ..



గత 20 సంవత్సరాల నుంచి పట్టణంలో మట్టి కుండల వ్యాపారం చేస్తున్నాం. ఎండ కాలంలో కుండలు ఎక్కువగా అమ్ముతాం. మట్టి ప్రాతలైన కాగులు, గురుగులు, ముంతలు, ప్రమిదలు, గల్లగురుగులు అమ్ముతుంటాం. వేసవి కాలంలో తప్ప మిగతా కాలంలో గిరాకీ లేక ఇబ్బందిగా ఉంటుంది.

– తాతారావు, మట్టి కుండల వ్యాపారి, భద్రాచలం

ఫ్లడ్‌లైట్ల పనులు ప్రారంభం



ఆలయం వద్ద ఫ్లడ్ లైట్ల పనులు పర్యవేక్షిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని వినాయకపురం గ్రామం వద్ద ఉన్న చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయ పరిసరాల్లో ఆధునిక సాంకేతికతో కూడిన ఫ్లడ్‌లైట్ల ఏర్పాటు చేసే పనులు శనివారం ప్రారంభమయ్యాయి. కొద్ది నెలల క్రితం ఈ ఆలయాన్ని సందర్శించిన రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తన సొంత ఖర్చులతో ఆలయం వద్ద ఫ్లడ్‌లను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ హామీ ప్రకారం ఆలయ పరిసరాల్లో సుమారు రూ.9 లక్షల వ్యయంతో ఏడు చోట్ల సెన్సార్లతో కూడిన ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేసే పనులను హైదారాబాద్‌కు చెందిన ఓ ఇంజనీరింగ్ సంస్థ చేపట్టింది. కాగా ఆలయం వద్ద ఈ నెల 19వ నుంచి జాతర ఉత్సవాలు ఆరంభం కానున్న నేపథ్యంలో లైట్ల ఏర్పాటు పనులు శరవేగంగా నిర్వహిస్తున్నారు. ఆలయం వద్ద ఫ్లడ్ లైట్ల పనులు మొదలు పెట్టడం పట్ల భక్తులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులను బీఆర్ఎస్ పార్టీ నాయకులు బిర్రం వెంకటేశ్వరరావు, యూఎస్ ప్రకాశ్, తాడేపల్లి రవి పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

అశ్వారావుపేట: మండల పరిధిలోని ఊట్లపల్లి వద్ద రెండు ద్విచక్ర వాహనాలు శనివారం ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. అశ్వారావుపేట మండలం జమ్మిగూడెం గ్రామానికి చెందిన కోలా వెంకటేశ్వరరావు, మాణిక్యంలు ఓ బైక్‌పై అశ్వారావుపేట నుంచి జమ్మిగూడెం వెళ్తున్నారు. ఏపీలోని కుక్కునూరుకు చెందిన జి.అశోక్, కోటేశ్వరరావులు మరో బైక్‌పై అశ్వారావుపేట వస్తున్నారు. రెండు బైక్‌లు ఊట్లపల్లి గ్రామంలోని అశ్వారావుపేట రోడ్‌లోని రైస్ మిల్లు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. గమనించిన స్థానికులు ప్రైవేటు వాహనాలపై అశ్వారావుపేట సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స నిర్వహించిన సిబ్బంది మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం వెళ్లాల్సిందిగా సూచించారు.

తూరుబాకలో ఇద్దరికి..

దుమ్ముగూడెం: మండలంలోని తూరుబాక గ్రామం శివారులో శనివారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. భద్రాచలం వైపు నుంచి తూరుబాక వైపు వస్తున్న కారు.. తూరుబాక వైపు నుంచి భద్రాచలం వెళ్తున్న ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఆటోలోని ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను వెంటనే ఆటోలో భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు. వారికి అక్కడ చికిత్స అందుతోంది. తూరుబాక గ్రామ శివారులో రోడ్డుపై గోతులున్నాయని, వాటిని తప్పించే క్రమంలో రెండు వాహనాలు ఢీకొన్నాయని గ్రామస్తులు తెలిపారు. రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

మండలంలోని ఎర్రగుంట గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. గ్రామంలో నివాసల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షక కంచె లేకపోవడం, తక్కువ ఎత్తులో ఉండటంతో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎత్తులో ఉంచాలని, రక్షక కంచెను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

- అన్నపురెడ్డిపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి: తరుణ్, ఏఈ
ఫోన్ నంబర్: 7901624864



రేపు ఉచిత కంటి వైద్య పరీక్షలు

భద్రాచలంటౌన్: పట్టణంలో ఈ నెల 13న ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు బందు వెంకటేశ్వర్లు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాత ఎల్‌ఐసీ ఆఫీస్ ఎదురుగా ఉన్న ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ కార్యాలయంలో వరంగల్ శరత్ మ్యాక్సీ విజన్ ఐ ఆస్పత్రి వైద్యులచేత కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే పాయం సంతాపం

మణుగూరురూరల్: మండలంలోని కట్టుమల్లారం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పిసోడి మోహన్‌రావు శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వారి నివాసానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి ఘన నివాళ్లర్పించారు. మోహన్‌రావు మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ..కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో కుంజా మణిబాబు, జగిడి ప్రసాద్, కొర్సా చంద్రయ్య, మడకం రాజులు, మోడెం రమణయ్య, పల్లపు తిరుమలేష్, దొడ్డపనేని మధుకుమార్, కటుకూరి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



డబుల్ బెడ్రూం ఇళ్ల దగ్గర మోటార్‌ను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

దుమ్ముగూడెం: మండల కేంద్రంలో దుమ్ముగూడెం గ్రామంలో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్ల దగ్గర తాగునీటి సమస్యను ఉందని, దీనిని వెంటనే పరిష్కరించాలని బీజేపీ అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ బిట్రగుంట క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఆ పార్టీ ఆధ్వర్యంలో డబుల్ బెడ్రూంలను సందర్శించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డబుల్ బెడ్రూం లబ్ధిదారులకు కనీస వసతులు కరువయ్యాయని అన్నారు. ఇళ్లు కేటాయించి ఎనిమిదినెలలే అయినప్పటికీ నాసిరకం నిర్మాణం వల్ల గోడలు, ఫ్లోరింగ్ పగిలిపోతున్నాయని, కనీసం ఏ ఒక్క ఇంటికీ కిటికీలను అమర్చలేదని అన్నారు. చలికాలం లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని, ఇప్పుడు మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని వెల్లడించారు. మరోవైపు సీసీ రోడ్డు లేకపోవడంతో వర్ష కాలంలో తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వాధికారులు స్పందించి వెంటనే లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దుమ్ముగూడెం బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కంద్రపు త్రినాథ రెడ్డి, బూత్ అధ్యక్షుడు గోర్స కామరాజు పొడియం భద్రయ్య, సోందె రామకృష్ణ,సోడి నాగరాజు, కణితి నరసింహారావు, మడకం చలపతి, పొడియం ముద్దరాజు, కణితి సీత తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ కార్డ్ గడువు పెంపు



మాట్లాడుతున్న ఏరియా జీఎం రామచందర్

మణుగూరుటౌన్: సింగరేణి సంస్థలో పని చేసి పదవి విరమణ పొందిన కార్మికులకు పదో వేజ్‌బోర్డ్‌లో ప్రవేశపెట్టిన కాంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్మెంట్ మెడికల్ స్కీం(సీపీఆర్ఎంఎస్)లో చేరేందుకు యాజమాన్యం దరఖాస్తు గడువును పొడిగించిందని సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. 2016లో సీపీఆర్ఎంఎస్ కోసం పదవి విరమణ పొందిన కార్మికుల నుంచి రూ.40వేలను రికవరీ చేసినట్లు తెలిపారు. గతంలో సకాలంలో దరఖాస్తు చేసుకోలేక పోయిన పదవి విరమణ కార్మికులకు ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం యాజమాన్యం కల్పించిందని తెలిపారు. హెల్త్ కార్డ్ కోసం నిర్ణీత రుసుము కంటే తక్కువ చెల్లించిన పదవి విరమణ కార్మికులు, చనిపోయిన కార్మికుల సతీమణులు మిగితా మొత్తాన్ని ఈ నెల 31వ తేదీలోపు చెల్లించి సంబంధిత గనులు, డిపార్ట్ మెంట్లలో సంప్రదించాలని సూచించారు.

అటవీ సంరక్షణలో నిర్లక్ష్యం

- కాలిపోతున్న అటవీ సంపద
- ఫారెస్టు కార్యాలయ సమీపంలోనే ప్రతిరోజూ మంటలు
- పట్టీపట్టనట్లుగా సంబంధిత అధికారులు



గత గురువారం రైల్వేస్టేషన్ సమీపంలో కాలిపోతున్న అడవి



ఇటీవల సింగరేణి స్కూల్ ఎదుట మంటలతో కమ్ముకున్న పొగ



ఇటీవల హనుమాన్ ఆలయం వద్ద రథం గుట్టపై కాలిపోతున్న చెట్టు

మణుగూరుటౌన్: మణుగూరు ఫారెస్టు అధికారులు అటవీసంరక్షణలో నిర్లక్ష్యంగా ఉన్నారని చెప్పడానికి ప్రతిరోజూ ఫారెస్టు కార్యాలయం చుట్టు పక్కల కాలిపోతున్న అటవీనే ప్రత్యక్షసాక్ష్యం. ఒక పక్క వేసవిలో అడవిలో కారాకులు కాల్చకుండా అనేక రకాల చర్యలు తీసుకుంటున్నామని అటవీశాఖ అధికారులు చెబుతున్నప్పటికీ వారి కార్యాలయం చుట్టు పక్కల పరిసరాల్లోనే ప్రతి రోజూ మంటలు చెలరేగి అడవి కాలిపోతుంది. మణుగూరు పట్టణాన్ని ఆనుకొని అర్బన్ పార్కులో అంతర్భాగంగా ఉన్న రథం గుట్ట నిరంతరం కాలిపోతోంది. అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వల్లనే ఈ విధంగా మంటలు చేలరేగుతున్నాయని స్థానిక ప్రజలు ఆవేద వ్యక్తం చేస్తున్నారు.

మణుగూరు పట్టణంలోని ప్రధాన రహదారుల్లో, పీవీకాలనీ రోడ్డుకు ఇరుపక్కల, రథంగుట్ట సమీపంలో, రైల్వేస్టేషన్ రోడ్డులో ప్రతిరోజూ చెత్త కాలిపోవడంతో అడవిలో పెద్ద పెద్ద మంటలు చెలరేగుతున్నాయి. దీంతో ఎప్పుడేం జరుగుతుందో అనే భయంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. అడవులు సంరక్షణ కోసం నిరంతరం కాపాలా కాసే ఫారెస్టు అధికారులు పట్టణ సమీపంలోనే ఈవిధంగా కాలిపోతుంటే ఏం చర్యలు చేపడుతున్నారనే అనుమానం ప్రజల్లో కలుగుతోంది.

ముందస్తు చర్యలు శూన్యం..

మణుగూరు మండల అటవీశాఖ అధికారులు మంటలు ఏర్పడిన తరువాత ప్రజల సమాచారంతో వెళ్లి ఆర్పడం తప్ప ముందస్తు చర్యలు ఏమాత్రం చేపట్టడంలేదనే విమర్శలు ప్రజల నుంచి వస్తున్నాయి. ప్రజలు అడవి నుంచి వంట కోసం కట్టేలు తీసుకొస్తుంటే పట్టుకునే అధికారులు.. అడవులు ఈ విధంగా కాలిపోయి తీవ్ర నష్టం కలుగుతుంటే ఏం చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా తగిన చర్యతు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యాన నిరసనలు



మణుగూరుటౌన్: సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



అశ్వారావుపేట: దిష్టిబొమ్మ దహనం చేస్తూ నినాదాలు చేస్తున్న కార్యకర్తలు

అశ్వారావుపేట: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ.. ఆయన దిష్టిబొమ్మను అశ్వారావుపేట బీఆర్ఎస్ నాయకులు శనివారం దహనం చేశారు. అనంతరం అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్‌లో బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అధ్యక్షుడు జల్లిపల్లి శ్రీరామమూర్తి, కలపాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం: స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో బండి సంజయ్‌కు వ్యతిరేకింగా నినాదాలు చేశారు. కవితపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన సంజయ్ క్షమాపణ చెప్పాలని పార్టీ మండల అధ్యక్షుడు అరికెల తిరుపతిరావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కె.కృష్ణమూర్తి, ములకలపల్లి మదారి, మామిడి పుల్లారావు, ఎండి.బషీర్, తాళ్ల రవికుమార్, ప్రమోద్ కుమార్, చాట్ల రవికుమార్, ఎల్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పినపాక: బయ్యారం క్రాస్ రోడ్‌లో బండి సంజయ్ దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు దహనం చేశారు. ఒక మహిళ అయిన తెలంగాణ గవర్నర్ సంజయ్‌పై ఏం చర్యలు తీసుకుంటారో చెప్పాలని పార్టీ మండల అధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి డిమాండ్ చేశారు. ఎంపీపీ గుమ్మడి గాంధీ, సొసైటీ చైర్మన్ రవిశేఖర్ వర్మ, ఆత్మ చైర్మన్ భద్రయ్య, రైతు సమన్వయ సమితి కన్వీనర్ దొడ్డ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: సారపాక ప్రధానకూడలిలో శనివారం సాయంత్రం బీఆర్ఎస్ నాయకులు బండి దిష్టిబొమ్మను దహనం చేసి, ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, టౌన్ అధ్యక్షులు కొనకంచి శ్రీనివాస్, పొడియం నరేందర్, భూపెల్లి నర్సింహారావు, చుక్కపల్లి బాలాజీ.వారాల వేణు, బండారి లక్ష్మీనారాయణ, బిట్రా సాయిబాబా, సోము లక్ష్మీచైతన్యరెడ్డి పాల్గొన్నారు.

మణుగూరుటౌన్: బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బీజేపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దిష్టిబొమ్మను పట్టణంలోని ప్రధాన రహదారిపై శనివారం దహనం చేశారు. భవిష్యత్తులో మహిళా నాయకులపై అమర్యాదగా మాట్లాడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మహిళా నాయకురాళ్లు, నాయకులు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలో శనివారం సాయంత్రం బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆ బొమ్మను చెప్పులతో కొట్టారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నంశెట్టి వరలక్ష్మి, సొసైటీ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ నిర్మల పుల్లారావు, చందా లక్ష్మీనర్సయ్య, చందా కుమారస్వామి, చిన్నంశెట్టి వెంకట నరసింహ పాల్గొన్నారు.

కరకగూడెం: బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల సోమయ్య బండి సంజయ్ దిష్టి బొమ్మను దహనం చేసి.. కవితపై వ్యాఖ్యాలను ఖండించారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.